సాక్షి
ఆదిలాబాద్
సోమవారం | 18 | నవంబర్ | 2024



భయం గుప్పిట్లో గ్రామాలు

జిల్లాలోకి పులి మళ్లీ ప్రవేశించింది. నిర్మల్ నుంచి శనివారం రాత్రి ఉట్నూర్ మండలంలోకి అడుగుపెట్టింది. ఆదివారం ఓ ఎద్దుపై దాడి చేసింది. అనంతరం నార్నూర్ మండలంలో మరో ఆవుపై దాడి చేయగా సమీప గ్రామాల ప్రజలు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆదిలాబాద్‌టౌన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శశికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. దశల వారీగా ఆందోళనల్లో భాగంగా ఇప్పటికే ఎస్టీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన 'కార్తిక' పూజలు



ప్రసాదం కోసం పోటీ పడుతున్న భక్తులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో కార్తీక మాసం పూజలు ఆదివారంతో ముగిశాయి. మఠాధిపతి యోగానంద సరస్వతి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టి మహా ప్రసాద వితరణ చేశారు.

నేడు జిల్లాకు ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాక

కైలాస్‌నగర్: రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ.ఫహీమ్ సోమవారం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన అధికారిక పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 8.30 గంటలకు మహారాష్ట్రలోని యావత్మాల్ నుంచి బయలుదేరి 11 గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకోనున్నారు. పట్టణంలోని శాంతినగర్, మహాలక్ష్మివాడ, భుక్తాపూర్ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించనున్నారు. కేంద్రాలకు బాలామృతం అందించడంతో పాటు ఐసీడీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం నిర్మల్ జిల్లా కేంద్రానికి బయలుదేరి వెళ్లనున్నారు.

సినిమా టెక్నాలజీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్ న్యాక్ సంస్థ ద్వారా సినిమా టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణకు గాను ఫీజు రూ.35 వేలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సినిమాటోగ్రఫీ, సౌండ్ రికార్డింగ్, వీడియో మేకింగ్ ప్రొడక్షన్ తదితర కోర్సుల్లో శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 9866565156, 6281444199 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శైలజకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఆదిలాబాద్‌రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఫుడ్‌పాయిజన్‌కు గురైన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని చౌదరి శైలజకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదన్నారు. ఈ క్రమంలోనే శైలజ ఫుడ్‌పాయిజన్‌కు గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుందన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన శైలజకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు.

వర్గీకరణ వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న దేవేంద్ర ప్రసాద్

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో మాదిగ, ఉపకులాల ఉద్యోగుల సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో జాప్యం సరికాదన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే వర్గీకరణ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పరిపల్లి నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి బదుగు గంగయ్య, ఉపాధ్యక్షుడు శంకర్, వసంత్, సాంబశివరావు పాల్గొన్నారు.

తాంసి మండలం బండల్‌నాగాపూర్ శివారులో మొరం క్వారీ



తవ్వేస్తున్నారు..



ఇక్కడ కనిపిస్తున్నది మావల శివారులో గతంలో గుట్టగా ఉన్న ప్రాంతాన్ని యథేచ్ఛగా తవ్వడంతో ప్రస్తుతం ఇలా మైదానంలా తలపిస్తోంది. నిత్యం వందలాది ట్రిప్పుల మొరం తరలింపు కారణంగా చివరకు ఈ ప్రాంతం ఇలా దర్శనమిస్తోంది. గుంతల మయంగా మారి గుట్ట ఆనవాళ్లు లేకుండా పోవడం గమనార్హం.

- జిల్లాలో గుట్టుగా మొరం అక్రమ తవ్వకాలు
- గుట్టలన్నీ గుంతలుగా మారుతున్నా.. పట్టించుకోని అధికారులు
- సర్కారు ఖజానాకు భారీగా గండి

ఆదిలాబాద్‌టౌన్: పుడమి తల్లి గుండెలపై ఆధునిక యంత్రాలు చిల్లులు పెడుతున్నాయి. స్వార్థపరుల అక్రమ దందాకు మట్టి ఆదాయవనరుగా మారుతోంది. యథేచ్ఛగా చేపడుతున్న తవ్వకాలతో గుట్టలు కాస్తా మైదాన ప్రాంతాలుగా దర్శనమిస్తున్నాయి. మొరం తవ్వాలంటే భూగర్భగనుల శాఖ అనుమతి తప్పనిసరి. అయితే జిల్లాలో మాత్రం మొరం అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. జిల్లా మైనింగ్ శాఖ అధికారికి అక్రమదందాపై పలువురు సమాచారం అందించినా స్పందించకపోవడం.. ఫోన్ చేసినా, కార్యాలయానికి వెళ్లినా అందుబాటులో ఉండకపోవడం ఆయన పనితీరుకు నిదర్శనం.

ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు..

కొంతమంది అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా ప్రకృతి సంపదను కొల్ల గొడుతున్నారు. ప్రొక్లెయిన్లతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతూ మొరం తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. జిల్లాలోని అటవీ, ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో పగలు రాత్రి తేడా లేకుండా జోరుగా తవ్వకాలు చేపడుతున్నారు. ఫలితంగా కొండలు సైతం కరిగిపోతున్నాయి. ఈ క్రమంలో ఏర్పడిన భారీ గుంతలతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. గతంలో పలువురు చిన్నారులు, మహిళలు, పశువులు వీటిలో పడి మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.


తనిఖీలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటి..

ప్రభుత్వ ఖజానాకు అక్రమార్కులు భారీగా గండీ కొడుతున్నా సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకపోవడం వెనుక ఆంతర్యమేమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఆయా మండల తహసీల్దార్ పరిధిలో ఏ భూముల్లో ఏం జరుగుతుందన్న విషయం బహిర్గతంగా తెలిసినప్పటికీ కింది స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారుల వరకు నెలవారి మామూళ్లు అందుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సదరు అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. అప్పుడప్పుడు తనిఖీలకు వెళ్లి అందినకాడికి దండుకొని జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మైనింగ్ అధికారులు తనిఖీలకు వస్తున్నారంటే అక్రమార్కులకు ముందుగా సమాచారం చేరుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. క్వారీల నిర్వాహకులు టిప్పర్ మొరంనకు రూ.600 చొప్పున తీసుకుంటుండగా, టిప్పర్ యజమానులు ట్రిప్పుకు రూ.2వేల వరకు తీసుకుంటూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఏజెన్సీ, మైదాన ప్రాంతమనే తేడా లేకుండా బడా బాబులు భూములను కొనుగోలు చేస్తూ వెంచర్లు వేస్తున్నారు. దీంతో మొరంనకు డిమాండ్ ఏర్పడుతోంది. లేఅవుట్లను తీర్చిదిద్దడానికి వేలాది ట్రిప్పుల మొరం అవసరం ఏర్పడటం అక్రమాలకు కలిసివస్తోంది. దీంతో ఇష్టారాజ్యంగా అనుమతులు లేని భూముల్లో సైతం తవ్వకాలు చేపడుతున్నారు. జిల్లాలో మొరం అక్రమ తవ్వకాల విషయమై 'సాక్షి' పలుసార్లు మైనింగ్ శాఖ జిల్లా అధికారి రవీందర్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రావడం లేదు.

అనుమతి లేకుండానే తవ్వకాలు..

మొరం అక్రమ దందా జిల్లాలోని ఆయా మండలాల్లో జోరుగా సాగుతోంది. గుడిహత్నూర్ ప్రాంతంలోని చింతగూడ, బేల మండలంలోని సైద్‌పూర్, సోన్‌కాస్, పలాయితాండ, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని బంగారిగూడ, కొత్తగూడెం, పిప్పల్‌ధరి, అంకోలి, కుమ్మరికుంట, యాపల్‌గూడ, రామాయి, మావల మండలంలోని మావల, బట్టిసావర్గాం, తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్, సవర్గాం, అలాగే తలమడుగు మండలంలోని దేవాపూర్, కజ్జర్ల అటవీ ప్రాంతం, తాంసి మండలంలోని మంగలిగుట్ట, నేరడిగొండలోని కుప్టి, కొర్టికల్, బందంరేగడి, వడూర్, తర్నం, బజార్‌హత్నూర్ మండలం, ఇంద్రవెల్లి.. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అక్రమ తవ్వకాల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పేదల భూములను వేల రూపాయల్లో లీజుకు తీసుకొని ఇష్టారీతిన తవ్వకాలు జరుపుతూ కోట్లు దండుకుంటున్నారు. వాల్టా చట్టం ప్రకారం ఏ భూమిలోనైనా తవ్వకాలు చేపట్టాలంటే తహసీల్దార్, మైనింగ్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వానికి సెస్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే జిల్లా వ్యాప్తంగా తవ్వకాల్లో ఏ ఒక్క క్వారీకి కూడా అనుమతి లేకపోవడం గమనార్హం.

కమ్యూనిటీ టాయ్‌లెట్స్



టాయ్‌లెట్ నిర్మాణానికి సంబంధించిన ప్లాన్



కమ్యూనిటీ టాయ్‌లెట్ నమూనా

- త్వరలో మండల కేంద్రాల్లో ఏర్పాటు
- 'ఉపాధి' నిధులతో నిర్మాణాలు
- ఒక్కో దానికి రూ.3లక్షల వ్యయం
- పూర్తయితే తొలగనున్న ప్రజల ఇక్కట్లు

జిల్లాలో..
గ్రామీణ మండలాలు : 17
కేటాయించిన మరుగుదొడ్ల లక్ష్యం : 20
ఇప్పటి వరకు ప్రతిపాదనలు అందించిన మండలాలు: 13

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఆయా మండల కేంద్రాలకు వస్తుంటారు. ఆ సమయంలో టాయ్‌లెట్స్ అందుబాటులో లేక ఒంటికి, రెంటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, యువతుల అవస్థలు వర్ణనాతీతం. ఇలాంటి పరిస్థితిని దూరం చేయాలని సంకల్పించిన కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణాలు చేపట్టాలని సంకల్పించింది. ఇందుకోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు కేటాయించింది. సాంకేతికత, ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మించనున్న ఒక్కో టాయ్‌లెట్‌కు రూ.3లక్షలను వెచ్చిస్తోంది. ఇందులో కేంద్ర ప్రభుత్వంతో పాటు పంచాయతీల భాగస్వామ్యాన్ని కూడా తప్పనిసరి చేసింది. కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే మండలాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, స్థలాల ఎంపిక ప్రక్రియ సైతం పూర్తి చేశారు. త్వరలోనే నిర్మాణాలు ప్రారంభించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

జిల్లాకు 20 మరుగుదొడ్ల కేటాయింపు

మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో రద్దీకి అనుగుణంగా ఆయా కూడళ్లలో వీటిని నిర్మించాలని కేంద్రం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు 20 మంజూరు చేసింది. ఈ నిర్మాణాలకు కేంద్రం 70శాతం నిధులు విడుదల చేస్తుండగా పంచాయతీలు 30శాతం వెచ్చించాల్సి ఉంటుంది. ఇందులో కేంద్రం వాటా రూ.2.10 లక్షలు కాగా, పంచాయతీల వాటా రూ.90వేలు. వీటి నిర్మాణాల కోసం 120 చదరపు అడుగుల అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఎంపీడీవోలు ఆయా మండల కేంద్రాల్లో స్థలాలను సైతం గుర్తించారు.

పంచాయతీల ఆసక్తి ...

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు పంచాయతీలు ఆసక్తి చూపుతున్నాయి. జిల్లాలో 17 గ్రామీణ మండలాలు ఉండగా ఇప్పటి వరకు 13 మండలాల నుంచి 17 గ్రామ పంచాయతీ అధికారులు కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణాల కోసం ప్రతిపాదనలు అందించారు. ఇచ్చోడ మండలంలో మండల కేంద్రంతో పాటు సిరిచెల్మ, బోథ్ మండలంలో మండల కేంద్రంతో పాటు సొనాల, తలమడుగు మండలంలో మండల కేంద్రంతో పాటు భరంపూర్ గ్రామాల్లోనూ అదనంగా టాయ్‌లెట్స్ మంజూరు చేయాలని ఆయా పంచాయతీల అధికారులు ప్రతిపాదలు అందజేశారు. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రధాన మండల కేంద్రమైన బేలతో పాటు గుడిహత్నూర్, మావల, గాదిగూడ మండలాల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని డీఆర్డీఏ అధికారులు చెబుతున్నారు. ప్రతిపాదనలు అందజేసిన పంచాయతీల్లో నిర్మాణాలకు అవసరమైన స్థలాలను సైతం ఎంపిక చేసినట్లు తెలిపారు.

నిర్వహణ బాధ్యత పంచాయతీలకే

కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్వహణ బాధ్యతలను పంచాయతీలే నిర్వహించేలా కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో రద్దీకనుగుణంగా యూజర్ చార్జీ తీసుకోవచ్చని సూచించింది. మరుగుదొడ్డి వినియోగానికి రూ.5, మూత్రశాల వినియోగానికి రూ.2 చొప్పున వసూలు చేయాలని పేర్కొంది. కేంద్రం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లైతే ప్రజల అత్యవసర కష్టాలు దూరం కానున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం..



మండలకేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణాలు చేపట్టేందుకు గాను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు కానున్నాయి. ఒక్కో దాన్ని రూ.3లక్షల వ్యయం కానుంది. జిల్లాలో 13 మండలాల నుంచి 17 టాయ్‌లెట్స్‌కు ఎంపీడీవోలు ప్రతిపాదనలు అందించడంతో పాటు వాటి నిర్మాణాలకు అవసరమైన స్థలాలను సైతం ఎంపిక చేశారు. ఈ మేరకు అనుమతి కోరుతూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాం. కలెక్టర్ అనుమతించిన వెంటనే ఆయా చోట్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– సాయన్న, డీఆర్‌డీవో

రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి

ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లాకు చెందిన చెస్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి రెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని చాణక్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా జిల్లాస్థాయి అండర్–9,13 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చెస్‌తో విద్యార్థుల్లో మేధస్సు పెంపొందుతుందన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అమీరొద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో పార్థసారథి

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వర్ధ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేస్తుందని మండిపడ్డారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చడం లేదన్నారు. బీజేపీ కూటమి విజయంతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. బీజేపీ హయాంలో వర్ధ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ నాయకుల అబద్ధపు ప్రచారాలను పార్టీ కార్యకర్తలు తిప్పికొట్టాలని అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి పంకజ్ బోయర్, తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ప్రశాంతంగా గ్రూప్–3 పరీక్షలు

- తొలిరోజు ఉదయం 6,612, మధ్యాహ్నం 6,581 మంది అభ్యర్థులు హాజరు
- కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ గౌస్ ఆలం



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్–3 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంతో పాటు మావల మండల కేంద్రంలోని 29 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. చాలామంది అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసులు వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఉదయం నిర్వహించిన పేపర్–1 పరీక్షకు జిల్లావ్యాప్తంగా 10,255 మంది అభ్యర్థులకు గాను 6,612 మంది హాజరయ్యారు. ఇందులో పురుషులు 3,964 మంది, మహిళలు 2,648 మంది ఉన్నారు. 64.48 హాజరు శాతం నమోదైంది. మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించిన పేపర్–2 పరీక్షకు 6,581 మంది హాజరయ్యారు. ఇందులో పురుషులు 3,945, మహిళలు 2,636 మంది ఉన్నారు. 64.17 హాజరు శాతం నమోదైంది. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా, సోమవారం పేపర్–3 పరీక్ష జరుగనుంది.



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

కలెక్టర్‌ను వేడుకున్నా దక్కని ఫలితం

కాగా, గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అభ్యర్థుకు సూచించిన అధికారులు ప్రకటించినట్లుగానే పరీక్షకు అర గంట ముందుగా గేట్లను మూసివేశారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల సెంటర్‌కు పలువురు అభ్యర్థులు ఆలస్యంగా హాజరయ్యారు. అప్పటికే సమయం ముగియడంతో సిబ్బంది లోనికి అనుమతించలేదు. అక్కడే ఉన్న మావల ఎస్సై విష్ణువర్ధన్‌ను వారు వేడుకున్నారు. అదే సమయంలోనే అక్కడకు వచ్చిన కలెక్టర్ రాజర్షి షాకు మొరపెట్టుకున్నారు. దూరప్రాంతాల నుంచి రావడంతో ఆలస్యమైందని తమను పరీక్షకు అనుమతించాలంటూ కలెక్టర్‌ను వేడుకున్నారు. అయితే నిబంధనల ప్రకారం అనుమతించడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేయడంతో వారు నిరాశతో వెనుదిరిగారు. ముఖ్యంగా ఒకరిద్దరు మహిళా అభ్యర్థులు కన్నీటితో ఇంటి ముఖం పట్టారు.



తమను అనుమతించాలని కలెక్టర్‌ను వేడుకుంటున్న పలువురు అభ్యర్థులు

క్లుప్తంగా

పోడుకోసం చెట్లు నరికివేత



లింగాపూర్ బీట్‌లో చెట్లు నరికివేసిన దృశ్యం

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ అటవీ బీట్ పరిధిలో 380 కంపార్ట్‌మెంట్‌లో పోడు వ్యవసాయం కోసం కొందరు వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున సుమారు ఎకరం స్థలంలో సుమారు 70 చెట్లకు పైగా నరికివేశారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకునే లోపు వారంతా పారిపోయారు. ఈ విషయమై తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మరావును వివరణ కోరగా అటవీ భూమిలో చెట్లు తొలగించిన విషయం వాస్తవమే, చెట్లను తొలగించినవారు దమ్మన్నపేటకు చెందిన వారిగా గుర్తించామన్నారు. వారందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి అటవీ భూమిలో చెట్లను తొలగించొద్దని అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్లు

జన్నారం: జన్నారం అటవీ రేంజ్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. పక్కా సమాచారంతోనే సిబ్బందితో నిఘా పెట్టగా ఇసుకతో మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారి ముజీబొద్దీన్ ఉన్నారు.

దాతలు సాయం కోసం ఎదురుచూపు



మంచంపట్టిన కిరణ్‌తో తల్లి అమృత

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన నిరుపేద యువకుడు అమంద కిరణ్ అనారోగ్యంతో మంచం పట్టాడు. కడుపు ఉబ్బసం, కాలేయం చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తండ్రి శ్రీనివాస్ గత కొన్నేళ్ల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి అమృత వంట పనులు చేస్తోంది. అప్పులు చేసి కుమారుడికి వైద్య చికిత్స అందిస్తోంది. అయినా కిరణ్ ఆరోగ్యం మెరుగుపడడం లేదు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేక దయనీయ పరిస్థితిలో దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. దాతలు ఫోన్ పే, గూగుల్ పే నంబర్ 9550227132 నంబర్‌లో నగదు పంపించాలని కోరింది.

పుస్తక పఠనం- పునర్వైభవంపై సెమినార్

మంచిర్యాలఅర్బన్: గ్రంథాలయ 57వ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయాలు-పుస్తక పఠనం - పునర్వైభవం అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుస్తక పఠనం వికాసాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. పఠనం ద్వారా వివిధ భాషలపై పట్టు పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కవులు, స్థానికులు శ్రీనివాస్, భూపతి సంతోష్, మల్లేశం, లైబ్రేరియన్లు మురళి, గోపి, రమేశ్ పాల్గొన్నారు.

జిల్లాల్లో పారామెడికల్ కోర్సులు

- నిర్మల్ వైద్య కళాశాలలో డీఎంఎస్టీ, డీఈసీజీ
- మంచిర్యాలలో డీఎంఎల్‌టీ, డీఎంఎస్టీ
- ఆయా కోర్సుల్లో మొత్తం 120 సీట్లు
- 20 వరకు దరఖాస్తు గడువు



నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల

నిర్మల్‌చైన్‌గేట్/మంచిర్యాలటౌన్: అనేక వ్యాధులకు చికిత్స అందించడంలో వైద్యుల పాత్ర ఎంత కీలకమో వారికి తెర వెనుక సహకారం అందించడంలో పారా మెడికల్ సిబ్బంది పాత్ర కూడా అంతే కీలకం. అంత ప్రాముఖ్యత కలిగిన పారామెడికల్ కోర్సులను అభ్యసించడానికి జిల్లా విద్యార్థులకు అవకాశాలు అందివచ్చాయి. నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు కోర్సుల్లో ప్రవేశాలకు పారా మెడికల్ బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది నుంచే డీఎంఎస్టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభం కానున్నాయి.

మెరుగవనున్న వైద్య సేవలు

పారామెడికల్ కోర్సులు ప్రారంభమైతే జిల్లా జనరల్ ఆస్పత్రిలో సేవలు మరింత మెరుగయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు జిల్లా జనరల్ ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే పారామెడికల్ కోర్సుల్లో చేరే వారు సైతం జిల్లా ఆస్పత్రిలో ప్రాక్టికల్స్‌కు వెళ్లడంతోపాటు మధ్యాహ్న సమయంలో వైద్య కళాశాలలో తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

ఇంటర్ పాసైన వాళ్లు అర్హులు

వైద్య సేవలు అందించేందుకు వైద్యులతోపాటు పారామెడికల్ సిబ్బందికి కూడా ప్రభుత్వం అవసరమైన వైద్య కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. పారామెడికల్‌లో మొత్తం 21 కోర్సులు ఉండగా నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ (డీఎంఎస్టీ), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ (డీఈసీజీ) కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున కేటాయించారు. ఈ కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులు. అయితే బైపీసీ విద్యార్థులు లేకపోతే ఇంటర్‌లో ఇతర కోర్సులు చేసిన వారికి సైతం అవకాశం కల్పించనున్నారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు www. tgpmb. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

మంచిర్యాలలో..

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల 2022లో ఏర్పడగా, ఇటీవలే మూడో ఏడాదిలోకి అడుగుపెట్టింది. 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రస్తుతం 300ల మంది వైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పారా మెడికల్‌లో 21 కోర్సులు ఉన్నాయి. డీఎంఎల్టీ, డీఎంఎస్‌టీ కోర్సులు ప్రారంభించింది. డీఎంఎల్టీ (డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్)లో 30 సీట్లు, డీఎంఎస్‌టీ (డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్)లో 30 సీట్లతో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు ఫారం, వివరాలకు www. tgpmb. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించడం, 040-24653519 నంబరులో సంప్రందించాలి.



మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల

దరఖాస్తు చేసుకోవాలి



నిర్మల్ వైద్య కళాశాలలో డీఎంఎస్టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభించాం. ఈ రెండు కోర్సులకు కలిపి 60 సీట్లు కేటాయించాం. ఈ కోర్సులు చేసినవారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలుంటాయి. ఇంటర్ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. – శ్రీనివాస్, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల, నిర్మల్

గూడెంలో కార్తిక పూజలు



సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో కార్తిక పూజలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం భక్తులు తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. సుమారు 425 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

రెండు చేతులు లేకపోయినా...

- గ్రూపు-3 పరీక్షలకు హాజరైన జాకీర్‌పాషా



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న జాకీర్‌పాషా

కాగజ్‌నగర్‌రూరల్: అంగవైకల్యం చదువుకు ఏమాత్రం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లోని చారిగాం ఏరియాకు చెందిన జాకీర్‌పాషా. పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినప్పటికీ పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించాలనే తపనతో నిరంతరం తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. ఆదివారం నిర్వహించిన గ్రూపు-3 పరీక్షకు ఉత్సాహంగా హాజరై పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలోని పరీక్షా కేంద్రంలో కాలితో పరీక్ష రాశాడు. గతంలో కూడా ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో కూడా తన బాధ్యతగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నాడు. అంతే కాకుండా హరితహారం కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొని కాలితో మొక్కలు నాటడం, రాయడం, పెయింటింగ్ వేయడంలాంటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు.

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: జీవితంపై విరక్తితో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినిత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అనుదీప్(30) ప్రైవేటు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గతంలో ఓ యువతితో ప్రేమ వ్యవహారంలో గొడవలు జరుగగా, రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో స్వల్పగాయాలై ప్రాణాలతో బయటపడ్డాడు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఎవరూ పెళ్లి చేసుకోరని మద్యానికి బానిసై ఏమి పనిచేయకుండా తిరుగుతుండేవాడు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో ఉరేసుకున్నాడు. తల్లి ఉమ తెల్లారి చూసేసరికి చీరతో దూలానికి అనుదీప్ ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. తల్లి ఉమ ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

తాంసి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ముంతాజ్ తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. భీంపూర్ మండలం బుర్కపల్లి గ్రామానికి చెందిన కుడ్మేత రాంచందర్ (35) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం వరుసకు సోదరుడైన వ్యక్తి ఇంటికి అతని లేని సమయంలో వెళ్లాడు. దీంతో వరుసకు సోదరుడు మందలించడంతో రాంచందర్ అవమానంగా భావించాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాత్రి వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం గుబిడిపల్లి శివారులో పురుగులమందు తాగి విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ముంతాజ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య మమత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



అనుదీప్ (ఫైల్)

ఆస్తి తగాదాలతోనే కొడుకుపై కత్తిదాడి

నార్నూర్: మండలంలోని గుంజాల గ్రామంలో శనివారం రాత్రి కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆస్తి తగాదాలతోనే కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసినట్లు సీఐ రహీం పాషా తెలిపారు. ఆయన క థనం ప్రకారం..గ్రామానికి చెందిన మెస్రం భుజంగరావుకు ముగ్గురు కొడుకులు ఉన్నా రు. నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. పెద్ద కొడుకు బాలాజీకి రంధాబాయితో పెళ్లయింది. వీరికి రెండు నెలల కుమారుడు ఉన్నాడు. ఆస్తిలో వాటా కావాలని కొన్నిరోజులుగా తండ్రి కొడుకుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికొచ్చిన తండ్రితో బాలాజీ గొడవపడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తండ్రి ఆవేశానికి లోనై బాలాజీ కడుపులో కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ రిమ్స్‌లో బాలాజీ చికిత్స పొందుతున్నాడు. తండ్రి పరారీలో ఉన్నాడు. బాధితుడి భార్య ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నస్పూర్: సింగరేణిలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్‌రావు అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో ఈనెల 12న లైజర్ సెల్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. లైజర్ సెల్ ద్వారా ఎస్సీ ఎస్టీ, మైనార్టీ మహిళా కార్మికుల సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందన్నారు. దీని ఏర్పాటుకు సహకరించిన ఎస్సీ ఎస్టీ మిషన్‌కు, సింగరేణి సీఎండీ బలరాం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘం ఒకటే ఉందన్నారు. ఎవరు ఎలాంటి ప్రకటనలు చేసినా కార్మికులు అయోమయానికి గురికావొద్దన్నారు. త్వరలో అన్ని ఏరియాల్లో పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. సమావేశంలో ఇరావుల శ్రీనివాస్ సెంట్రల్ కమిటీ మెంబర్, డేగల ప్రవీణ్‌కుమార్ వైస్ ప్రెసిడెంట్, నాయకులు అంద వెంకట్, లక్ష్మణ్, వేల్పుల ప్రవీణ్, వాసు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

మహారాష్ట్రలో ఏపీ డిప్యూటీ సీఎం ప్రచారం

ఆసిఫాబాద్: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా బల్లార్షా బీజేపీ అభ్యర్థి సుధీర్ మునిగంటివార్ తరఫున ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. బల్లార్షాలో తెలుగు ఓటర్లు ఉండడంతో ఇక్కడి నాయకులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, పార్టీ రాష్ట్ర నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, బీజేవైఎం రాష్ట్ర అధికారి ప్రతినిధి ఎలగతి సుచిత్, శ్రావణ్‌గౌడ్, ఇగురపు సంజీవ్, జిల్లా నాయకులు ఉన్నారు.



ప్రచారంలో పవన్‌కల్యాణ్‌తో నాయకులు

భయం గుప్పిట్లో గ్రామాలు

- నాగాపూర్, చాందూర్ గ్రామాల్లో పెద్దపులి సంచారం
- ఎద్దుపై దాడితో భయాందోళనలో గ్రామస్తులు



నాగాపూర్ శివారులో గుర్తించిన పులి పాదముద్రలు



పులి సంచారంతో జామ్‌డా సమీపంలో గుమిగూడిన గిరిజనులు

ఉట్నూర్‌రూరల్/నార్నూర్: నిర్మల్ జిల్లాకేంద్రం నుంచి సంచరిస్తూ వస్తున్న పెద్దపులి శుక్రవారం పెంబి మండలంలో గేదె, దూడపై దాడి చేసింది. శనివారం పెంబి దోందరి, చిసిచెల్మ రేంజ్ పరిధిలోని వంకతుమ్మ ప్రాంతంలో ఎద్దుపై దాడి చేసి గాయపర్చింది. అక్కడి నుంచి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నాగాపూర్‌లో ఆదివారం కనిపించింది. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన యువకులు పులిని గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని నీటి కాల్వలో పులి పాదముద్రలు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. మధ్యాహ్నం చాందూర్ సమీపంలో రాజుల్‌గూడకు చెందిన కుమ్ర ఆనంద్‌కు చెందిన ఎద్దుపై దాడి చేసి గాయపర్చిందని స్థానికులు పేర్కొన్నారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఉట్నూర్ ఎఫ్ఆర్వో శిలానంద్.. నాగాపూర్, చాందూర్ గ్రామాలను సందర్శించారు. పాదముద్రలను గుర్తించి పులిగా నిర్ధారించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులను అప్రమత్తం చేశారు. రెండు రోజులపాటు పంట పొలాలకు, బయటికి వెళ్లొద్దన్నారు. పొలాల వద్ద విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దన్నారు. ప్రస్తుతం పులి..నాగాపూర్, చాందూరి మీదుగా నార్నూర్ మండలం జామడ వైపుగా వెళ్లిందని అధికారులు నిర్ధారించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నార్నూర్, జైనూర్ మండలాల మీదుగా జోడేఘాట్ అడవులకు వెళ్లనుందని, అక్కడ ఆడపులి సంచరిస్తుందని అధికారులు పేర్కొన్నారు. పులి సంచారంతో గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పులి సంచారంతో గ్రామస్తుల ఆందోళన

ఉట్నూర్, నార్నూర్ ప్రాంతంలో పులి సంచారంతో మండలంలోని జామ్‌డా, తాడిహత్నూర్, గుంజాల, నాగల్‌కొండ, పట్నాపూర్, మహగావ్, చోర్గావ్ గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎఫ్ఎస్‌వో సుదర్శన్ జాదవ్ తెలిపిన వివరాలు.. ఆదివారం ఉట్నూర్ మండలంలోని నాగాపూర్ వద్ద వాకింగ్ చేస్తున్న కొందరు యువకులకు పులి కనిపించడంతో వారు భయంతో పరుగులు తీశారు. హస్నాపూర్, శంకర్‌నాయక్ తండా మీదుగా మధ్యాహ్నం నార్నూర్ మండలం జామ్‌డా శివారులో పశువులు మేత మేస్తుండగా పులి ఆవుపై దాడి చేసింది. కాపరి కేకలతో అక్కడి నుంచి వెళ్లిపోయిందని గ్రామస్తులు తెలిపారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను గుర్తించారు. నార్నూర్ మండలం జామ్‌డా, తాడిహత్నూర్, నాగల్‌కొండ, చోర్గావ్, బాబేఝరి, సుంగాపూర్, మహగావ్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండురోజులపాటు ప్రజలు పత్తి ఏరేందుకు గాని ఇతర వ్యవసాయ పనులకు వెళ్లొద్దని సూచించారు. సోలార్ జట్కా మిషన్, కరెంట్ తీగలను ఎవరూ పెట్టవద్దన్నారు. జామ్‌డా నుంచి కుమురం భీం జిల్లా జైనూర్ మండలం మీదుగా కెరమెరి మండలం జోడేఘాట్ అటవీ ప్రాంతానికి పులి వెళ్లిపోతుందన్నారు.

గిరిజనుడిని చితకబాదిన అధికారులు



గిరిజన సంఘం నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రవీందర్

- రామలక్ష్మణుల గుట్ట వద్ద ఘటన
- పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

వేమనపల్లి: గిరిజనుడిని అటవీ అధికారులు చితకబాదిన ఘటన మండలంలోని సుంపుటం అటవీ ప్రాంతంలోని రామలక్ష్మణుల గుట్ట వద్ద చోటుచేసుకుంది. బాధితుడు, కళ్లెంపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు కుస్రం రవీందర్ తెలిపిన వివరాలు.. ఈనెల 15న తన బావ ఆత్రం బక్కయ్యతో కలిసి రామలక్ష్మణుల గుట్ట వద్దకు చీపురు సేకరణ కోసం వెళ్లాను. అక్కడే ఉన్న తిరుమాను చెట్లకు లక్క ఉండటంతో చెట్టును నరికి సేకరించారు. సమాచారం అందుకున్న ఎఫ్ఎస్ఓ బేగ్, వేమనపల్లి ఎఫ్‌బీవో సోఫియాబేగం భర్త పాషా అక్కడికి వెళ్లారు. అధికారులను చూసి బక్కయ్య పరుగెత్తగా రవీందర్‌ను అదుపులోకి తీసుకుని కొట్టారు. బైక్‌పై కుశ్నపల్లి అటవీ కార్యాలయానికి తరలించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితుడు తెలిపాడు. ఆదివారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశంలతో కలిసి నీల్వాయి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



అధికారుల దాడిలో గాయపడిన రవీందర్

ఎలాంటి దాడి చేయలేదు

కళ్లంపల్లి గ్రామస్తులు గతేడాదిగా లక్క సేకరణ కోసం చెట్లను నరుకుతున్నారు. 15న అటవీ ప్రాంతానికి వెళ్లిన తమను చూసి అందరూ పరారయ్యారు. రవీందర్ పరుగెత్తగా కిందపడగా గాయాలయ్యాయి. అతడిపై దాడికి చేయలేదు. కేసు పెడతారనే నెపంతో దాడి చేసినట్లు వారు ఆరోపణ చేస్తున్నారు. కాగా, వేమనపల్లిలో తాను అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి కళ్లంపల్లి గ్రామస్తులు దాడికి యత్నించారని ఎఫ్‌బీఓ సోఫియాబేగం డీఆర్‌వో రూపేష్, భర్త పాషాతో కలిసి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. – బేగ్, ఎఫ్ఎస్ఓ